సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 14 । జూన్ । 2023



.. నిలుస్తుంది ప్రాణం

ఒకరు రక్తదానం చేస్తే ముగ్గురి ప్రాణాలు నిలపొచ్చు. 18 - 60 ఏళ్ల వారు జీవితకాలంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చు.

8లో



మరింత చేదుగా కాకర!

మండు వేసవిలో దుక్కులు సిద్ధం చేసి కాకర సాగు చేసిన రైతులు పెట్టుబడి కూడా దక్కని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

10లో

గరిష్టం / కనిష్టం
41° / 28°

వాతావరణం

జిల్లాలో బుధవారం భానుడి ప్రతాపం అధికంగా ఉంటుంది. రాత్రి వరకూ వేడి వాతావరణంతో ఇబ్బందులు తప్పవు.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చనలో భక్తులు

పాల్వంచరూరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారి ఆలయంలో మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమార్చన, విష్ణుసహస్రనామ, లలితా సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

16న రుద్రహోమం

మాసశివరాత్రి సందర్భంగా ఈనెల 16న ఉదయం 9 మధ్యాహ్నం 1 వరకు రుద్ర హోమం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

బాల్యాన్ని కాపాడండి

జిల్లా జడ్జి పాటిల్ వసంత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: బాల్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పేదరికంతో చాలా మంది బాల కార్మికులుగా మారుతున్నారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి బడిలో చేర్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, వార్డు కౌన్సిలర్ లీలారాణి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నిరంజన్‌రావు, త్రీటౌన్ సీఐ అబ్బయ్య, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు..

సేవలు విస్తృతం చేయాలి




మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ సబిత

భద్రాచలంఅర్బన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అందించే సేవలు విస్తృతం చేయాలని జిల్లా సంక్షేమాధికారి సబిత అన్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం భద్రాచలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా సంక్షేమం కోసం రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. రక్తహీనత లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భద్రాచలం ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఆర్డీఓ రత్నకళ్యాణి, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి వెంకటేశ్వర్లు, దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి పాలిసెట్ కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు బుధవారం నుంచి కౌన్సెలింగ్ మొదలుకానుంది. ఈనెల 14 నుండి 18 వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉండగా, 16 నుండి 19వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 16 నుండి 21వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ నమోదుకు అవకాశం ఉంటుందని కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగమునినాయక్ తెలిపారు. వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్న వారికి 25 నుండి ప్రొవిజినల్ సీట్ల అలాట్‌మెంట్, 25 నుండి 29వ తేదీ వరకు సీట్లు కేటాయించనుండగా, ఫీజు చెల్లించాలని సూచించారు. ఇక చివరి విడత కౌన్సెలింగ్ జూలై 1వ తేదీన, స్పాట్ అడ్మిషన్లు జూలై 7 నుండి 17 వరకు ఉంటాయని తెలిపారు. కాగా, ఉమ్మడి జిల్లాలో మధిర, కొత్తగూడెం, మణుగూరుల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా 720 సీట్లు, తొమ్మిది ప్రైవేట్ కళాశాలల్లో 1,980 సీట్లు ఉన్నాయని వెల్లడించారు.

ముక్కలు చెక్కలై..



భద్రాచలం పట్టణ వ్యూ

'దశాబ్ది'లో దిశా నిర్దేశం కరువైన భద్రాచలం

- అభివృద్ధి, వరాల మూటలు మాటలకే పరిమితం
- అతిపెద్ద ఏజెన్సీ చిన్నబోయిన వైనం
- ఐదు పంచాయతీలను తిరిగి కలపాలని స్థానికుల డిమాండ్

భద్రాచలం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఈ దశాబ్ద కాలంలో రాష్ట్రమంతా అభివృద్ధిలో పరుగులు పెడుతున్నా, భద్రాచలం ఏజెన్సీ మాత్రం దిశా నిర్దేశం, అభివృద్ధి లేక నిస్తేజంగా మారింది. రాష్ట్ర, జిల్లాల విభజనలో ముక్కలుగా చీలిపోయిన భద్రాచలం ఏకాకిగా మిగిలింది. పలు ముఖ్యమైన కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లడంతో దిక్కూ మొ క్కూ లేకుండా ఉండిపోయింది. భద్రాచలం అంటే శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికే పరిమితమైన ఖ్యాతిని కూడగట్టుకుంది. రాష్ట్రం మొత్తం దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటున్న తరుణంలో భద్రాచలానికి జరిగిన అన్యాయాన్ని గుర్తు చేసుకుంటూ స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నారు.



మండల పరిషత్ పోయె..
పాలక మండలి లేదాయె..

మండలాల్లో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు కృషి చేసే మండల పరిషత్ సైతం భద్రాచలంలో లేకపోవడం శోచనీయం. ఈ మండలంలో గ్రామాలు లేకపోవడంతో మండల పరిషత్, జెడ్పీటీసీ హోదాలను రద్దు చేశారు. దీంతో ఇక్కడున్న మండల పరిషత్ కార్యాలయాన్ని నూతనంగా ఏర్పడిన ఆళ్లపల్లి మండలానికి తరలించారు. 80 వేలకు పైగా జనాభా ఉన్న భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీలో పాలకవర్గం లేక ఐదేళ్లు కావస్తోంది. 2018 ఆగస్టులో గ్రామ పంచాయతీ పాలకవర్గం ముగిసినా, ఇప్పటి వరకు మళ్లీ ఎన్నికలు జరగలేదు. భద్రాచలం, సారపాకను మున్సిపాలిటీలుగా మారుస్తూ ప్రభుత్వం ప్రకటించడం, దీనిపై గిరిజన సంఘాలు హైకోర్టుకు వెళ్లడం, ఆ తర్వాత భద్రాచలంను మూడు, సారపాకను రెండు పంచాయతీలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేయడమే కాక అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్ ఆమోదానికి పంపారు. అయితే రాష్ట్ర, జిల్లా విభజనతో ఇప్పటికే భద్రాచలం నష్టపోయిందని, మళ్లీ పంచాయతీల విభజనతో మరింత నష్టపర్చవద్దని ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆధ్వర్యంలో స్థానికులు గవర్నర్ తమిళి సైకి విన్నవించారు. దీంతో ఆ బిల్లును గవర్నర్ ఆమోదించకుండా తిప్పి పంపారు. ఇలా అనేక పరిణామాలతో భద్రాచలం గ్రామపంచాయతీ ఐదేళ్లుగా పాలకవర్గం లేకుండానే సాగుతోంది. ఇక గతంలో భద్రాచలం డివిజన్‌లో కొనసాగిన అనేక విద్యాలయాలు, కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిపోవడంతో పట్టణం కళ తప్పింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా భద్రాచలానికి ఇస్తామన్న రూ.100 కోట్లలో ఒక్క పైసా విడుదల చేయకపోవడంతో ఈ దశాబ్దిలో ఏమాత్రం అభివృద్ధి చేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అతిపెద్ద ఏజెన్సీ చిన్నబోయింది..

తెలంగాణ ఆవిర్భావంతో భద్రాచలం ఏజెన్సీ ప్రాభవానికి గండి పడింది. రాష్ట్ర విభజనతో భద్రాచలం డివిజన్‌లో ఉన్న కూనవరం, చింతూరు, వీఆర్‌పురం, భద్రాచలం పట్టణం మినహా ఇతర గ్రామాలు ఏపీలో విలీనం అయ్యాయి. దీంతో రాష్ట్రంలోనే అతి పెద్దదైన భద్రాచలం ఏజెన్సీ చిన్నదైంది. భద్రాచలం మండలంలోని యటపాక, పురుషోత్తపట్నం, గుండాల, కన్నాయిగూడెం, పిచుకలపాడు గ్రామపంచాయతీలను సైతం ఆంధ్రప్రదేశ్‌లో కలపడంతో పట్టణానికే పరిమితమై మండల పరిధి కుచించుకుపోయింది. ఇక జిల్లాల పునర్విభజనతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. భద్రాచలం నియోజకవర్గంలోని వెంకటాపురం, వాజేడు మండలాలను ములుగు జిల్లాలో కలిపారు. రాష్ట్ర విభజనకు ముందు ఎనిమిది మండలాలతో వర్ధిల్లిన భద్రాచలం ప్రస్తుతం మూడు మండలాలకే పరిమితమైంది.

ఆ ఐదు పంచాయతీలను కలపాలి..

ప్రజాభీష్టం లేకుండా ఏకపక్షంగా ఏపీలో కలిపిన ఐదు పంచాయతీలను తిరిగి భద్రాచలం మండలంలో విలీనం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భౌగోళికంగా భద్రాచలంతో ఆ ప్రాంతాలకు ఉన్న అనుబంధంతో తమను ఇక్కడే కొనసాగించాలని ఆయా గ్రామాల వారు పలుమార్లు బంద్‌లు, రాస్తారోకోలు చేశారు. వీరి ఉద్యమానికి బీఆర్‌ఎస్ మినహా స్థానిక రాజకీయ పార్టీలన్నీ మద్దతు తెలిపాయి. ఇటీవల భద్రాచలం వచ్చిన గవర్నర్ తమిళి సైకి సైతం ఆయా గ్రామాల వారు తమ సమస్యలు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఇక కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లేందుకు వారు సిద్ధమవుతున్నారు.

నేత్రపర్వంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



వైద్య శిబిరంలో ఈఓ రమాదేవి, వైద్య శాఖ అధికారులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.



వైద్య శిబిరం విజయవంతం..

తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా రామాలయంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆలయ ఈఓ ఎల్.రమాదేవి ప్రారంభించారు. కంటి, చర్మ వైద్య నిపుణులు సేవలందించారు. ఈఓతో పాటు అర్చకులు, పండితులు, భక్తులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. బుధవారం సైతం ఈ శిబిరం కొనసాగుతుందని ఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో అలయ ప్రధాన అర్చకులు విజయరాఘవన్, వైద్య శాఖ అధికారులు డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతిని కలిసిన కొండరెడ్లు



కొండరెడ్డి గిరిజనులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

దమ్మపేట: దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు చెందిన కొండరెడ్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మంగళవారం ఢిల్లీలో కలిశారు. దమ్మపేట మండలం పూసుకుంట గ్రామం నుంచి ఇద్దరు, అశ్వారావుపేట మండలం బండారిగుంపు, గోగులపూడి, గాండ్లగూడెం గ్రామాల నుంచి 11 మందిని భద్రాచలం ఐటీడీఏ అధికారులు ఢిల్లీ తీసుకెళ్లారు. దేశంలోని ఆదిమ తెగల గిరిజనులతో సమావేశం నిర్వహించిన రాష్ట్రపతి.. వారి యోగక్షేమాలను రాష్ట్రపతి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గైడ్ సహాయంతో రాష్ట్రపతి భవన్, పాత పార్లమెంట్ భవనంతో పాటు అక్షరధామం, ఇండియాగేట్ తదితర ప్రదేశాలను గిరిజనులకు చూపించారు.

మహిళలకు పెద్దపీట

ఎమ్మెల్యే వనమా, కలెక్టర్ అనుదీప్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా తదితరులు

చుంచుపల్లి : స్వరాష్ట్రంలో మహిళలకు ప్రభుత్వం అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తోందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్‌కే నగర్ కమ్మ సత్రంలో నిర్వహించిన వేడుకలను వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి మారుమూల గ్రామాల్లోనూ అంగన్‌వాడీ కార్యకర్తలు సేవలందిస్తున్నారని, సఖి కేంద్రాలు మహిళలకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. బాలల ఎదుగుదల అంగన్‌వాడీ కేంద్రాల నుంచే ప్రారంభమవుతుందని, అంగన్‌వాడీ సిబ్బంది అద్భుతంగా సేవలు అందిస్తున్నారని అన్నారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే జిల్లాలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉందని, దీంతో బాధపడుతున్న చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు 1,030 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలతో కూడిన ఆహారం అందిస్తున్నామని వివరించారు. జిల్లాలో 1000 ఎకరాల్లో రైతులు చిరుధాన్యాలు సాగు చేస్తున్నారని చెప్పారు. రేగళ్ల గ్రామానికి చెందిన శైలజ తన కూతురు గుండెకు రంధ్రం ఉన్నదని, అంగన్‌వాడీలో ఇచ్చే ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యవంతురాలిగా మారిందని చెప్పడంతో కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి బుధవారం చేపట్టిన సామ్, మామ్ డే తో అద్భుత ఫలితాలు సాధించామని చెప్పారు. అనంతరం వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోనా, సర్పంచ్ బదావత్ సుగుణ, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ పాల్గొన్నారు.

'సీతమ్మ సాగర్'పై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

అశ్వాపురం: భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు 320 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా.. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్ పనులపై బుధవారం అశ్వాపురంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అశ్వాపురంతో పాటు మణుగూరు, చర్ల, దుమ్ముగూడెం మండలాల నిర్వాసితులు హాజరు కానున్నారు.

నిలిచిన పనులు..

పర్యావరణ అనుమతులు లేకుండా సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారంటూ దుమ్ముగూడెం మండలానికి చెందిన ఇద్దరు నిర్వాసితులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(చెన్నై)కు ఫిర్యాదు చేశారు. దీంతో పనులు ఆపాలని ఎన్‌జీటీ మార్చి 23న ఉత్తర్వులు జారీ చేసింది. అయినా పనులు కొనసాగించడంతో పిటిషనర్లు, నిర్వాసితులు అశ్వాపురం, చర్ల మండలాల్లో పనులు అడ్డుకుని ఆందోళన చేశారు. పనుల ఫొటోలు, వీడియోలతో మరోసారి ఎన్‌జీటీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసి జూలై 12కు కేసును వాయిదా వేయగా, ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి.

మెరుగైన పరిహారం అందించాలని..

ప్రాజెక్ట్ నిర్మాణంలో అశ్వాపురం, మణుగూరు, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో 3,700 ఎకరాల భూమి సేకరిస్తున్నారు. ఇప్పటికే 3,267 ఎకరాలు సేకరించగా మరో 500 ఎకరాలు సేకరించనున్నారు. అయితే భూములు కోల్పోతున్న నిర్వాసితులు తమకు మెరుగైన పరిహారం, ఉద్యోగాలు ఇవ్వాలంటూ ఎంతో కాలంగా ఆందోళన చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.8 లక్షలు, రూ.10 లక్షల పరిహారం వద్దంటూ బ్యారేజీ, కరకట్టల పనులను పలుమార్లు అడ్డుకున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య గవర్నర్ తమిళిసైను నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. ఇక నేడు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలోనూ తమ గళం వినిపించనున్నారు.

దుమ్ముగూడెంలో నిరసన

దుమ్ముగూడెం: తమకు న్యాయమైన ప్యాకేజీ లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని నిర్వాసితులు మంగళవారం ఆందోళన చేశారు. తహసీల్దార్ మణిధర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సీతానగరంలో గ్రామసభ నిర్వహించారు. రెండో విడత సర్వేలో భూములు కోల్పోతున్న తమకు ఎకరాకు రూ.30 లక్షలు, లేదా భూమికి భూమి ఇవ్వాలని అధికారుల దృష్టికి తేగా, వారు పట్టించుకోకుండా గ్రామ సభ నుంచి వెళ్లిపోయారని బాధితులు వాపోయారు. సర్పంచ్ తెల్లం వరలక్ష్మి పిలిచినా అధికారులు ఆగలేదని అన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఖాదర్ బాబు, పీసా కమిటీ సభ్యులు వాగే రాజేశ్వరి. రామలక్ష్మి, వాగే అల్లేష్, ఆకుల కష్ణ అర్జున రావు, లక్ష్మీపతిరావు, పుల్లారావు, రాము, మురళి, నవీన్, సమ్మక్క, కాంతమ్మ, నాగమణి పాల్గొన్నారు.

రక్తదానం.. నిలుస్తుంది ప్రాణం..

- ఒకరి రక్తంతో ముగ్గురికి ఉపయోగం
- రక్తదానంపై విస్తృత ప్రచారం అవసరం

నేడు రక్తదాతల దినోత్సవం

రక్తం కేవలం శరీరంలో ఎముక మజ్జ నుంచి మాత్రమే తయారవుతుంది.. దీనిని కృత్రిమంగా తయారు చేయలేం.. పలు కారణాల చేత రక్తం అవసరం అయితే.. మరొకరు తన రక్తాన్ని దానం చేయడం తప్ప మరో మార్గం లేదు. అలా ఇంకొకరికి ప్రాణం పోసే అవకాశం వచ్చినప్పుడు ఎందరో ముందుకు వస్తున్నారు. ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా..


పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో రక్తదానం చేస్తున్న అప్పటి ఏఎస్పీ రోహిత్‌రాజ్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: రక్తం శరీరానికి ఇంధనం. పౌష్టికాహార లోపం, వ్యాధి నిరోధక శక్తి మందగించడం , ప్రమాదాల్లో గాయపడి రక్తస్రావం ఏర్పడినప్పుడు రక్తం కొరత ఏర్పడుతోంది. ఆ లోటును పూడ్చేందుకు ఒకే ఒక్క అవకాశం.. రక్తం ఎక్కించడం. రక్తదానం చేసేవాళ్లు ఉంటేనే అత్యవసర పరిస్థితుల్లో ఇంకొకరి ప్రాణం కాపాడొచ్చు.

ఎవరు చేయొచ్చంటే..
ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 60 ఏళ్లలోపు ప్రతిఒక్కరూ రక్తదానం చేయొచ్చు. ఓ వ్యక్తి తన జీవితకాలంలో దాదాపు 168సార్లు రక్తదానం చేయొచ్చు. మత్తు మందులకు అలవాటుపడినవారు, హెపటైటిస్–బీ, సీ, హెచ్‌ఐవీ, రక్తపోటు అధికంగా ఉన్నవారు రక్తం ఇవ్వడానికి అవకాశం లేదు. రక్తదానం అనంతరం మహిళలైతే ఆరు, పురుషులైతే మూడు నెలల తర్వాతే రెండోసారి రక్తం ఇవ్వాలి. శరీర బరువు సగటున 45 కేజీలున్న వారు (హిమోగ్లోబిన్ 12.5 గ్రాములుండాలి) రక్తదానం చేయాలి.

ముగ్గురి ప్రాణం నిలపొచ్చు..
ఒక వ్యక్తి దానం చేసే రక్తం.. ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తం ఇవ్వగానే దాన్ని వివిధ కాంపోనెంట్లుగా విభజిస్తారు. దాత నుంచి సేకరించే రక్తం (హోల్ బ్లడ్)లో ప్లాస్మా, ప్లేట్లెట్స్, తెల్లరక్తకణాలు, ఎర్రరక్తకణాలు ఉంటాయి. అప్పుడు ఒక్కరి రక్తమే కనీసం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుంది. రక్తదానం చేస్తే కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

కొరవడిన అవగాహన కార్యక్రమాలు..
రక్తదానంపై నెలకొన్న అపోహలను పోగొట్టేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. అధికారులు రక్తదానంపై ప్రజల్లో ఎప్పటికప్పుడు విస్తృత ప్రచారం చేసి, అవగాహన కల్పిస్తే చాలామంది ప్రాణాలు కాపాడినవారవుతారు. బుధవారం రక్తదాన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కూనవరంరోడ్డులోని 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ క్యాంప్‌లో ఏరియా ఆస్పత్రి వైద్యుల సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు 141 సీఆర్పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్‌ధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.

50 సార్లు రక్తదానం


రక్తదానం చేస్తున్న కొప్పుల మురళి (ఫైల్)

పట్టణానికి చెందిన కొప్పుల మురళి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. సమాజ సేవలో భాగంగా రక్తదానం చేస్తున్నాడు. కొన్నేళ్ల కిందట మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి అవసరమున్న ప్రతి ఒక్కరికీ రక్తం అందేలా ప్రయత్నిస్తున్నాడు. స్థానిక ఏరియా ఆస్పత్రికి కాన్పు కోసం వచ్చే మహిళలు, ప్రమాదాల్లో గాయపడిన బాధితులను ఆదుకోవడం కోసం తానొక్కడే కాకుండా శిబిరాలను ఏర్పాటు చేసి అనేక మందితో రక్తదానం చేయిస్తున్నాడు. ఇప్పటివరకు ఆయన 50 సార్లు రక్తదానం చేశాడు. ఎన్నో వేల రక్తం యూనిట్లను ఏరియాస్పత్రికి అందించారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మంగళవారం రాజ్‌భవన్‌లో మురళిని సత్కరించారు.

సమాచారం వచ్చిన వెంటనే స్పందిస్తాం



షాజ్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో యువకులంతా కలిసి రక్తదానం చేస్తున్నాం. కొన్నేళ్లుగా భద్రాచలం పట్టణంలో నేను రక్తదానం చేయడంతో పాటు అనేక మందితో రక్తదానం చేయించాను. నేను ఇప్పటి వరకు 60 సార్లు రక్తదానం చేశాను. పట్టణంలో అనేక సార్లు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశాం.
–జిందా, షాజ్ బ్లడ్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు, భద్రాచలం

శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం..



రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిత్యం రక్తం అవసరం ఉన్న వారికి రక్తం అందిస్తున్నాం. రక్తం నిల్వలు తక్కువగా ఉన్నందున స్వచ్ఛందంగా యువత ముందుకు వచ్చి రక్తదానం చేయలి. అభిమాన నాయకులు, సినిమా హీరోల పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసే విధంగా కృషి చేయాలి.
–ఎస్‌ఎల్ కాంతారావు, జిల్లా రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్

అన్ని ఏర్పాట్లు చేయాలి

వైద్య, ఆరోగ్యశాఖ ఉత్సవాలపై కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్


టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వైద్య, ఆరోగ్య దినోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. ఈ నెల 14న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ వేడుకల నిర్వహణపై మంగళవారం వైద్యాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐదు నియోజకవర్గాల్లో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్తగూడెం వైద్య కళాశాల, ఇల్లెందు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పినపాక స్నేహ గార్డెన్స్, మాంటిస్సోరి స్కూల్, భద్రాచలం కేకే ఫంక్షన్‌హాల్లో వేడుకలు నిర్వహించనున్నామని తెలిపారు. ఉత్తమ ఆశ వర్కర్, ఉత్తమ ఏఎన్‌ఎం, ఉత్తమ స్టాఫ్ నర్స్, ఉత్తమ టెక్నీషియన్, ఉత్తమ డాక్టర్లను సత్కరించడంతోపాటు ప్రశంసాపత్రాలు అందించాలని సూచించారు. పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో జూన్ 15న నిర్వహించే పల్లెప్రగతి, 16న నిర్వహించే పట్టణ ప్రగతి కార్యక్రమాలపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. డీపీఓ రమాకాంత్, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, జెడ్పీసీఈఓ విద్యాలత తదితరులు పాల్గొన్నారు.

గ్రామదీపిక గోల్‌మాల్

- పోకలగూడెంలో పక్కదారి పట్టిన రూ.5.21 లక్షలు స్త్రీనిధి నిధులు
- మేనేజర్ బహిరంగ విచారణతో వెలుగులోకి..


విచారణ జరుపుతున్న స్త్రీనిధి మేనేజర్ సంపత్

చండ్రుగొండ: మండలంలోని పోకలగూడెం గ్రామంలో స్త్రీనిధి నిధులు పక్కదారి పట్టాయి. రుణ మొత్తాలతోపాటు పొదుపునకు సంబంధించిన డబ్బులు ఈ ఏడాది మార్చి నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదు. రూ.5.21 లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు ఆడిట్ లెక్కల్లో బహిర్గతమైంది. దీంతో స్త్రీనిధి మేనేజర్ సంపత్, సెర్ప్ ఏపీఎం సంతోష్‌కుమార్ రంగంలోకి దిగి మంగళవారం గ్రామంలో బహిరంగ విచారణ జరపగా గ్రామదీపిక సొంత అవసరాలకు వాడుకున్నట్లు తేలింది. వివరాలిలా ఉన్నాయి.. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం, పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా మహిళలతో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు మంజూరుచేస్తోంది. 2022–23 ఏడాదికి గాను పోకలగూడెం గ్రామంలోని జైహనుమాన్ గ్రామ సమాఖ్య పరిధిలోని 22 స్వయం సహాయక సంఘాలకు రూ.1.22 కోట్లు స్త్రీనిధి రుణాల కింద మంజూరయ్యాయి. రుణాలను ఈ ఏడాది ఫిబ్రవరి వరకు బాగానే చెల్లించారు. మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన వాయిదాల మొత్తం జమ కాలేదు. దీంతో గ్రామంలో బహిరంగ విచారణ జరపగా గ్రామదీపిక ఆ మొత్తం కాజేసినట్లు బహిర్గతమైంది. ఆమె తన సొంత అవసరాలకు ఆ సొమ్ము వాడుకున్నట్లు తేలింది. దీంతో ఆగ్రహించిన మహిళలు సెర్ప్ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 3 నెలలుగా డబ్బులు పక్కదారి పడుతున్నా ఏం చేస్తున్నారని మండిపడ్డారు. సెర్ప్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగానే ఇంత మొత్తం పక్కదారి పట్టిందని ఆరోపించారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున ఘర్షణ వాతావరణం నెలకొంది. గ్రామంలోని పెద్దలు జోక్యం చేసుకుని సర్ది చెప్పారు. కాజేసిన సొమ్మును నెలరోజుల్లో చెల్లిస్తానని గ్రామదీపిక లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో వాగ్వాదం తాత్కాలికంగా సద్దుమణిగింది.

సెర్ప్ అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు?
పోకలగూడెంలో స్త్రీనిధి నిధులు పక్కదారి పట్టడంతో పర్యవేక్షించాల్సిన సెర్ప్ అధికారులు, సిబ్బందిపై మహిళా సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రతి నెల గ్రామదీపికల ద్వారా వసూలైన వాయిదాల మొత్తం బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు. ఈ ప్రక్రియను క్లస్టర్ వారీగా సీసీలు, మండల స్థాయిలో ఏపీఎం పర్యవేక్షిస్తారు. అయితే 3 నెలలుగా డబ్బు ఖాతాల్లో జమ కాకున్నా పర్యవేక్షించాల్సిన వారు ఏం చేస్తున్నట్లు అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. నిధుల గోల్‌మాల్ బాగోతంలో వారి హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఉదంతంపై జిల్లాస్థాయి అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వృద్ధులు, దివ్యాంగుల కోసం 'చేయూత'


ఉమ్మడి జిల్లాకు కేటాయించిన వాహనం

ఖమ్మంగాంధీచౌక్: ఆపదలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం 'చేయూత' వాహనాన్ని తీసుకువచ్చింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కలిపి ఒక వాహనాన్ని కేటాయించగా, ఆపదలో ఉన్న వారు 155326 నంబర్‌కు ఫోన్ చేస్తే వాహనంలో సిబ్బంది వచ్చి సహకరిస్తారు. జిల్లా సంక్షేమ శాఖ ఈ వాహనం నిర్వహణ బాధ్యతలు చూసుకోనుండగా పర్యవేక్షణకు ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్‌ను నియమించారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన మహిళా సంక్షేమం దినోత్సవం సందర్భంగా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ చేయూత వాహనాన్ని ప్రారంభించారు.

క్లుప్తంగా

రైతులు అప్రమత్తంగా ఉండాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. గ్రామాల్లో ఎవరో ఒక రైతును ఆసరా చేసుకుని మిగతా వారికి నకిలీ విత్తనాలు అంటగట్టేందుకు దళారులు ప్రయత్నిస్తారని పేర్కొన్నారు. లైసెన్స్‌డ్ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. పత్తి విత్తనాల విషయంలో కొందరు యూ ట్యూబ్ ద్వారా రకరకాల ప్రచారం చేస్తున్నారని, అలాంటివి నమ్మవద్దని కోరారు. పత్తిలో జీఈఏసీ అప్రూవల్ బీజీ 2 విత్తనం మాత్రమే కొనుగోలు జేయాలని సూచించారు. నకిలీ విత్తనాల సమాచారం తెలిస్తే 7288894276, 7288894213 టోల్‌ఫ్రీ నంబర్లకు తెలియజేయాలని కోరారు.

కుక్క మరణం.. ఇరు వర్గాల ఘర్షణ

పాల్వంచరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ కుక్క మృతిచెందింది. ఈ ఘటన రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసింది. మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన తాలుకూ వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కిన్నెరసాని జీపీ రాజాపురంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం గొగ్గల రమణ, పాపయ్యకు చెందిన పెంపుడు కుక్క గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందింది. సమాచారం అందుకున్న యజమాని ఘటనా స్థలానికి వచ్చి అదే రోడ్డులో కిరాణా దుకాణం నడుపుకుంటున్న బుడగం సత్యనారాయణ, అతడి భార్య, తల్లిపై కుక్కను చంపింది మీరే అంటూ గొడవకు దిగాడు. తాము కుక్కను చంపలేదని చెప్పినా వినిపించుకోకుండా రాత్రి సమయంలో అసభ్య పదజాలంతో దూషించారు. అనంతరం ఎస్‌ఐ శ్రీనివాస్ కుక్క మృతిపై విచారణ జరపగా గుర్తుతెలియని ఆటో ఢీకొని మృతిచెందిందని తేలింది. గొడవకు కారణమైన రమణ, పాపయ్యపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: కోడి పందేల స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. స్థానిక ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని దొంతికుంట శివారులో కొంతమంది కోడి పందేలు నిర్వహిస్తుండగా, సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రెండు పందెం కోళ్లు, రూ.4 వేల నగదు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి
అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని బండి సుబ్రహ్మణ్యంనగర్‌లోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.7,880 నగదును స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం


దగ్ధమవుతున్న ఇల్లు

పినపాక: ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని ఈ–బయ్యారం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బచ్చలకూరి రమణ, నాగేశ్వరరావు దంపతులు బయటకు వెళ్లగా ఇంట్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చేలోపే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో సమయానికి ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు...


దగ్ధమైన ఇంట్లోని సామగ్రి

టేకులపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో ఉన్న సామగ్రి, నగదు కాలిపోయిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గంగారం పంచాయతీ సంపత్‌నగర్ గ్రామానికి చెందిన జాటోత్ లచ్చు ఐస్‌క్రీం అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి లచ్చు ఇంటి పక్కన ఓ పెళ్లి వేడుక జరుగుతుండటంతో అక్కడికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో అకస్మాత్తుగా లచ్చు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి సామగ్రి అంతా కాలిబూడిదైంది. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

నేను ప్రిన్సిపాల్‌ని.. నేను డీఆర్‌డీఓను..

ఎమ్మెల్యే సమక్షంలోనే ఇరువురి వాగ్వాదం


వాగ్వాదానికి దిగిన డీఆర్డీఓ, ప్రిన్సిపాల్

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారి, స్థానిక గురుకుల కళాశాల మహిళా ప్రిన్సిపాల్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానిక గిరిజన భవన్‌లో మహిళా సంక్షేమ ఉత్సవాలు ముగిసిన తర్వాత ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వేదిక దిగుతున్న క్రమంలో అశ్వారావుపేటలోని జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలిక పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న ఆయనను కలిశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల భవనానికి సంబంధించిన మురుగు కాల్వను గ్రామ పంచాయతీ బాధ్యులు పూడ్చి వేశారని, దీంతో ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్య గురించి సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే పక్కనే ఉన్న డీఆర్డీఓ మధుసూదన్‌రాజు కలగజేసుకొని ప్రయోజనం లేదా అని.. ప్రిన్సిపాల్‌ను నువ్వు అంటూ సంబోధించారు. ఆమె సీరియస్‌గా తాను ప్రిన్సిపాల్‌నని చెప్పగా, ఐతే ఏంటి నేను డీఆర్డీఓను అంటూ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే సమక్షంలోనే వారిద్దరి మధ్య వాగ్వాదం నెలకొంది. ఎమ్మెల్యే కలగజేసుకొని సర్ది చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

జిలెటిన్‌స్టిక్స్ సరఫరా చేస్తున్న నలుగురి అరెస్ట్

వివరాలు వెల్లడించిన మణుగూరు డీఎస్పీ


స్వాధీనం చేసుకున్న జిలెటిన్ స్టిక్స్, వైర్‌తో పాటు పట్టుబడిన వారిని చూపిస్తున్న మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు

అశ్వాపురం: అడవుల్లో కూంబింగ్ చేసే పోలీసులే లక్ష్యంగా మందుపాతరలు పెట్టే మావోయిస్టులకు జిలెటిన్ స్టిక్స్, కార్డెక్స్ వైరు సరఫరా చేస్తున్న నలుగురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మణుగూరు డీఎస్పీ ఈ మేరకు మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. మావోయిస్టు నేతలు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, బడే చొక్కారావు అలియాస్ దామోదర్ ఆదేశాల మేరకు చర్ల, అశ్వాపురం మండలాలకు చెందిన ఇర్పా రామారావు, కొమరం అర్జున్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, కన్నెబోయిన వెంకటేశ్వర్లు ఎనిమిది జిలెటిన్ స్టిక్స్, 50 మీటర్ల కార్డెక్స్ వైరు సరఫరా చేస్తూ.. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనుల వద్ద సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. వారిని విచారించగా మావోయిస్టులకు సరఫరా చేస్తున్నామని అంగీకరించారు. నలుగురినీ అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఇర్పా రామారావు గతంలో నాలుగు కేసుల్లో నిందితుడని, ఫిబ్రవరి మొదటి వారంలో ఎర్రబోరు–బోధనెల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై 20 కేజీల మందుపాతర అమర్చి పోలీసులను చంపేందుకు యత్నించిన కేసులోనూ అతడు నిందితుడని చెప్పారు. డీఎస్పీ వెంట సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సురేష్ తదితరులు ఉన్నారు.

మావోయిస్ట్ అరెస్ట్
దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా బెజ్జి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీరబట్టి అటవీ ప్రాంతంలో మావోయిస్టు సోడి గంగను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ కిరణ్‌చౌహాన్ తెలిపారు. మంగళవారం వీరబట్టి అటవీప్రాంతంలో గాలింపు చేపట్టగా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా మావోయిస్టుగా తేలిందని వివరించారు.

గోదావరిలో బాలుడి గల్లంతు

రాత్రి వరకు కూడా లభించని ఆచూకీ


ప్రమాదానికి ముందు ట్యూబ్ సాయంతో గోదావరిలో బాలుడు ఈశ్వర్

మంగపేట: బంధువుల ఇంటికి పెళ్లికి వచ్చిన బాలుడు స్నేహితులతో కలిసి స్నానం చేస్తూ గోదావరిలో గల్లంతైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాలుడి బంధువులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని భూపతిరావుపేట గ్రామానికి చెందిన కొంగర ఈశ్వర్ (14) తన తల్లి భ్రమరాంబతో కలిసి మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన బంధువు సింగవరపు భరత్ వివాహానికి ఈ నెల 7న వచ్చారు. వివాహం అనంతరం తల్లి స్వగ్రామానికి వెళ్లింది. పాఠశాలలు ప్రారంభం కాగానే బంధువులతో కలిసి ఇంటికి వస్తానని చెప్పి ఈశ్వర్ ఇక్కడే ఉండిపోయాడు. మంగళవారం ఉదయం సుమారు 15 మంది బంధువులు, స్నేహితులతో కలిసి కమలాపురంలోని ఇంటేక్‌వెల్ వద్ద గోదావరి స్నానానికి వెళ్లారు. అరగంటపాటు అందరితో కలిసి స్నానం చేస్తూ సంతోషంగా గడిపాడు. ఈ క్రమంలో కొంత లోతుగా ఉన్న ప్రాంతంలో ఈత కొడుతుండగా ట్యూబ్ జారి పోయింది. దీంతో ఒక్కసారిగా ఈశ్వర్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. బంధువులు, స్నేహితులు ఎంత వెతికినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న మంగపేట పోలీసులు జాలర్ల సాయంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి వరకు నాటు పడవలు, వలల సాయంతో గాలించినా ఆచూకీ లభించలేదు. బాలుడు గల్లంతు కావడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. శుభకార్యం జరిగిన ఇంట్లో విషాదం అలుముకుంది.

పలువురు సీఐల బదిలీలు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి, వరంగల్ జిల్లాల్లోని సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ కమాండెంట్ కంట్రోల్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న వినయ్‌కుమార్‌ను పాల్వంచకు, పాల్వంచలో పని చేస్తున్న నాగరాజును ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సీసీఆర్బీలో పనిచేస్తున్న రమేష్‌ను కొత్తగూడెం టూటౌన్ సీఐగా నియమించారు. ఇక్కడ పని చేస్తున్న ఎల్.రాజును మహబూబాబాద్ జిల్లా మరిపెడకు, మరిపెడలో ఉన్న సాగర్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కొత్తగూడెంలో డీసీఆర్‌బీలో చేస్తున్న ఉపేందర్‌ను మహబూబాబాద్ జిల్లా దోర్నకల్‌కు బదిలీ చేశారు. మహబూబాబాద్ సీసీఎస్‌లో పని చేస్తున్న శ్రీనివాస్‌ను జూలూరుపాడుకు, జూలూరుపాడులో పని చేస్తున్న వసంత్‌ను ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ


తాళం పగులగొట్టిన హుండీ

పాల్వంచ: పట్టణంలోని సీ–కాలనీలో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి చొరబడి హుండీ తాళాన్ని పగులగొట్టి అందులోని నగదును అపహరించాడు. సుమారు రూ.6 వేల వరకు నగదు చోరీ అయి ఉండవచ్చని ఆలయ నిర్వాహకులు చీమల శ్రీను పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయంలోని సీసీ ఫుటేజీలో నమోదైన వీడియోను పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. రహదారి పక్కనే ఉన్న ఈ ఆలయంలో ఇప్పటికే పలుమార్లు చోరీ జరగడం గమనార్హం.

ద్విచక్రవాహనాలు ఢీ

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

అన్నపురెడ్డిపల్లి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రాజాపురం గ్రామానికి చెందిన వల్లపు కోటయ్య (60) గొర్రెలు కాస్తూ ఒంటరిగా జీవనం కొనసాగిస్తున్నాడు. కొద్ది రోజుల కిందట కోటయ్యకు జ్వరం రావడంతో దామరచర్లకు చెందిన తన తమ్ముడి కుమారుడు రాము ద్విచక్రవాహనంపై రాజాపురం నుంచి ఆస్పత్రికి తీసుకువెళ్తున్నాడు. మండలంలోని కట్టుగూడెం గ్రామానికి చెందిన పంకు బాయమ్మ దంపతులు తమ ద్విచక్రవాహనంపై ఎర్రగుంట నుంచి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కట్టుగూడెం జాతీయ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో కోటయ్యకు, బాయమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. 108 ద్వారా వారిని కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోటయ్య మరణించాడు. తీవ్రంగా గాయపడిన బాయమ్మను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వడదెబ్బతో లారీక్లీనర్ మృతి

దమ్మపేట: వడదెబ్బతో లారీక్లీనర్ మృతిచెందిన ఘటన మండలంలోని ముష్టిబండ గ్రామ శివారులోని రాజస్థాన్ దాబా హోటల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్ర సోలాపూర్ జిల్లా మంగళ్‌వేడలోని మానేగల్లి గ్రామానికి చెందిన జావీద్ ఇసాక్ భగవాన్ (43) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం డ్రైవర్ ముస్తాక్ ముషాక్ భగవాన్, క్లీనర్ జావీద్‌లు జిప్సం లోడుతో లారీలో విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ముష్టిబండ గ్రామ శివారులో గల దాబా హోటల్ వద్ద ఆగి భోజనం చేశారు. అనంతరం మంచినీరు తాగడానికి దాబా లోకి వెళ్లిన క్లీనర్ జావిద్ వడదెబ్బ తగలడంతో అకస్మాత్తుగా కిందపడి అక్కడికక్కడే మరణించాడు. మృతుడి సోదరుడు ఆసీఫ్ ఇసాక్ భగవాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పినపాక: చెట్టుకు ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని ఈ–బయ్యారం అడ్డరోడ్డుకు చెందిన మామిళ్ల శంకరయ్య (58) కిరాణా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగానే మంగళవారం ఉదయం వాకింగ్‌కు అని వెళ్లిన ఆయన ఐలాపురం శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన మృతదేహాన్ని చూసిన స్థానికులు కుటుంబీకులు, పోలీసులకు సమాచారం ఇవ్వగా, కుమారుడు ఆదినారాయణ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, శంకరయ్య ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

గురుకుల కొలువుల

దరఖాస్తులో సవరణకు అవకాశం

- పోస్టుల వారీగా సవరణకు తేదీలను ప్రకటించిన టీఆర్ఈఐఆర్బీ
- సవరణకు అవకాశం ఒక్కసారి మాత్రమేనని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించిన దరఖాస్తుల్లో వివరాల సవరణకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్బీ) అవకాశం కల్పించింది. ఐదు గురుకుల సొసైటీల పరిధిలో 9 వేలకు పైబడి ఉద్యోగాలకుగాను టీఆర్ఈఐఆర్బీ గత నెల 27వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించిన సంగతి తెలిసిందే. అయితే అభ్యర్థులు సమర్పించిన ఆన్లైన్ దరఖాస్తుల్లో అక్కడక్కడా తప్పులు దొర్లడంతో పాటు వన్ టైమ్ రిజిస్ట్రేషన్(ఓటీఆర్) సమయంలోనూ పొరపాట్లు జరిగినట్లు టీఆర్ఈఐఆర్బీకి పెద్ద సంఖ్యలో వినతులు వచ్చాయి. దీంతో దరఖాస్తులో సవరణకు అవకాశం కల్పించింది. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పోస్టు కేటగిరీ వారీగా సవరణ తేదీలను అందులో పేర్కొంది. సగటున ఒక్కో పోస్టుకు సంబంధించిన దరఖాస్తు సవరణకు 5 రోజుల గడువు ఇచ్చింది.

ఎడిట్ అవకాశం ఒక్కసారే...

గురుకుల కొలువుల దరఖాస్తు సవరణకు ఒక్కసారి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు స్పష్టం చేసింది. ఒకసారి సవరణ చేసుకున్న అభ్యర్థికి మరోసారి సవరణకు అవకాశం ఉండదని వివరించింది. ఇప్పటికే ప్రింట్ తీసుకున్న దరఖాస్తు ఫారాన్ని పరిశీలించి పొరపాట్లు ఎక్కడ దొర్లాయో గుర్తించి ఆమేరకు సవరణ చేసుకోవాల్సి ఉంటుంది. సవరణ చేసుకునే అభ్యర్థి ముందుగా గురుకుల బోర్డు వెబ్సైట్లో లాగిన్ కావాల్సి ఉంటుంది. ఉన్నత విద్యకు సంబంధించిన వివరాలు, సొసైటీ ప్రిఫరెన్సెస్, ఎగ్జామ్ సెంటర్ ప్రిఫరెన్స్ తదితర వివరాల సవరణకు అప్లికేషన్ కరెక్షన్ టాబ్ ద్వారా ఎడిట్ చేసుకోవాలి. అభ్యర్థి బేసిక్ డీటైల్స్, ఇతర వివరాలు, చిరునామా, ఫొటో, సంతకం, తదితరాల సవరణ, అప్డేషన్కు మాడిఫై వన్టైమ్ రిజిస్ట్రేషన్ దగ్గర క్లిక్ చేయాలి. సవరణ తర్వాత పీడీఎఫ్ దరఖాస్తు ఫారాన్ని డౌన్లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాలి.

పోస్టు కేటగిరీల వారీగా సవరణ తేదీలు

- జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులతో పాటు స్కూళ్లలో పోస్ట్గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ) : ఈనెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు.
- డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, పాఠశాలల్లో లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్, డ్రాయింగ్/ఆర్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్స్ట్రక్టర్/క్రాఫ్ట్ టీచర్, మ్యూజిక్ టీచర్ : ఈనెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు
- ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ): 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు

మీ చిరునవ్వుల్లో సకల సంతోషాలు

ఈ ప్రభుత్వం మీదే.. ఉద్యోగికి మంచి చేయాలన్నదే నా తపన: ఏపీ సీఎం జగన్

కేబినెట్ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ ఏపీ సీఎంను కలసిన ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: ఉద్యోగులు సంతోషంగా ఉంటే డెలివరీ మెకానిజం బాగుంటుందని, తద్వారా ప్రజలు సంతోషంగా ఉంటారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పేర్కొన్నారు. కొందరు రాజకీయ కారణాలతో చెప్పే అంశాలను ఉద్యోగులు విశ్వసించనక్కరలేదని, నా మనసు ఎప్పుడూ మీకు మంచి చేయడం కోసమే ఉంటుందని, అన్నింటినీ పరిష్కరిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నెల 7వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో కొత్తగా జీపీఎస్ తీసుకురావడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీవీపీ విలీనం, 12వ పీఆర్సీ ఏర్పాటు సహా ఉద్యోగులకు సంబంధించి తీసుకున్న పలు నిర్ణయాలపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపాయి.



ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఈమేరకు ఏపీ జేఏసీ అమరావతితో సహా పలు ఉద్యోగ సంఘాల నేతలు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్తో సమావేశమయ్యారు. ''ఉద్యోగులను సంతోషంగా ఉంచేందుకు నా తరఫు నుంచి ప్రతి కార్యక్రమాన్ని మనసా, వాచా, కర్మణా చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నా. ఈ విషయాన్ని ఎప్పుడూ దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నా..'' అని ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం జగన్ అన్నారు.

మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు

ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని రాష్ట్ర సీఎం వైఎస్ జగన్కి తెలియజేశామని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఉద్యోగ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించినందుకు సీఎం జగన్ను కలిసి ధన్యవాదాలు తెలిపామన్నారు. 47 అంశాలపై సీఎస్కు తాము లేఖ ఇస్తే 36 అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇందుకు సీఎం జగన్కు ధన్యవాదాలు తెలిపామని చెప్పారు. సోషల్ మీడియాలో ఉద్యోగ సంఘాలపై పలువురు వ్యతిరేకంగా పలు రకాల చర్చ నడుపుతున్నారని, ప్రభుత్వానికి ఉద్యోగులను దూరం చేసేందుకే పలు రాజకీయ పార్టీలు ఈ చర్చ నడుపుతున్నాయని తెలిపారు.



ఓబీసీ మహాసంఘ్ మెగా కన్వెన్షన్కు

ఏపీ సీఎంకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ ప్రతినిధులు మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ను కలిశారు. ఆగస్టు 7న తిరుపతిలోని ఎస్వీ స్టేడియంలో నిర్వహించనున్న 8వ జాతీయ మెగా కన్వెన్షన్లో పాల్గొనాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందజేశారు. సీఎం జగన్ను కలిసిన వారిలో ఆలిండియా బ్యాక్వర్డ్ క్లాస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ జస్టిస్ వి.ఈశ్వరయ్య, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ నాయకులు డాక్టర్ బాబారావు తైవాడే, సచిన్ రాజుర్కర్, జాజుల శ్రీనివాస్గౌడ్, కేశన శంకరరావుతో పాటు మంత్రి జోగి రమేశ్ కూడా ఉన్నారు. అనంతరం జస్టిస్ వి.ఈశ్వరయ్య మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహించే సభకు ఆహ్వానించగా.. సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటులో ప్రైవేటు బిల్లుపెట్టిన ఘనత వైఎస్సార్సీపీకే దక్కుతుందన్నారు.

ఎంపీ అవినాశ్ జైలు పాలే మీ లక్ష్యమా?

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్రెడ్డిని జైలుపాలు చేయడమే మీ లక్ష్యమా? అని సుప్రీంకోర్టు ధర్మాసనం నర్రెడ్డి సునీతను ప్రశ్నించింది. ఈ వ్యవహారం చూస్తుంటే ఈగో క్లాషెస్లా ఉందని వ్యాఖ్యానించింది. తొందరపడి వ్యక్తిగత వాదనల ద్వారా నష్టపోతారేమో చూసుకోవాలని హితవు పలికింది. పిటిషనర్ సునీత విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేస్తూ అదనపు డాక్యుమెంట్లు అందచేసేందుకు అనుమతించింది. ఎంపీ వైఎస్ అవినాశ్రెడ్డి ముందస్తు బెయిల్ను రద్దు చేయాలంటూ నర్రెడ్డి సునీత దాఖలు చేసిన పిటిషన్ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్నాథ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. అయితే సుప్రీం వెకేషన్ బెంచ్ సీనియర్ న్యాయవాదులను అనుమతించకపోవడంతో పిటిషనర్ సునీత తన వాదనలు తానే వినిపించడం ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా ఆమెకు సహకరించేందుకు ధర్మాసనం అనుమతించింది. తాను పిటిషనర్నని, తన తండ్రి హత్యకు గురయ్యారని సునీత చెబుతుండగా.. ఆ విషయాల్లోకి తాము వెళ్లడం లేదని, వెకేషన్లో ఎందుకు వచ్చారని ధర్మాసనం ప్రశ్నించింది. 'ఈ కేసులో జూన్ 30 కల్లా దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఛార్జిషీట్ ముందే ఫైల్ చేయాల్సి ఉంది. ఏ – 8 (అవినాశ్) భారీ కుట్ర చేసిన ప్రధాన వ్యక్తుల్లో ఒకరు. సీబీఐ దర్యాప్తునకు సహకరించడంలేదు. ముందస్తు బెయిలు పొందడం వల్ల కస్టోడియల్ ఇంటరాగేషన్ కుదరడం లేదు. ముందస్తు బెయిలు ఎందుకు ఇచ్చారో కారణాలు తెలియడం లేదు'' అని సునీత పేర్కొన్నారు. ఈ సమయంలో జస్టిస్ విక్రమ్నాథ్

- సునీతకు సుప్రీంకోర్టు ప్రశ్న
- ఎందుకీ ఈగో క్లాషెస్?
- ప్రతివాది మీ కజినే కదా?
- అంత అత్యవసరం ఏముంది? వెకేషన్ బెంచ్కు ఎందుకు?
- ఇప్పుడీ పిటిషన్ను కొట్టివేస్తే సీనియర్ న్యాయవాదికి ఇబ్బందే
- సీబీఐకి నోటీసులివ్వలేం.. విచారణ 19కి వాయిదా

జోక్యం చేసుకుంటూ 'దీంట్లో అంతగా అత్యవసరమైన పరిస్థితి ఏముంది? వెకేషన్ బెంచ్కు రావాల్సిన అవసరం ఉందా?' అని ప్రశ్నించారు.

సీబీఐ చూసుకుంటుంది..

'ఒక వ్యక్తిని అరెస్టు చేయాలో లేదో దర్యాప్తు సంస్థ చూసుకుంటుంది. ఎవరిని, ఎప్పుడు అరెస్టు చేయాలో ఎవరిని కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయాలో సీబీఐకు తెలుసు. విచారణకు సహకరిస్తున్నారా లేదా అనేది కూడా సీబీఐ చూసుకుంటుంది. మీరెందుకు జోక్యం చేసుకుంటారు? ఈ కేసులో పలు సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నాయి. మీకెందుకు ఈగో క్లాషెస్? అతడిని (ఎంపీ అవినాశ్) జైలుపాలు చేయాలన్న లక్ష్యమా? ఆవిధంగా చూడొద్దు. ఈ తరహా ప్రొసీడింగ్స్ ఎందుకు?'' అని జస్టిస్ అమానుల్లా వ్యాఖ్యానించారు.



ఇప్పుడీ పిటిషన్ను కొట్టివేస్తే..

ఎంపీ అవినాశ్రెడ్డి ఇతర నిందితులతో కలసి సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సునీత ఆరోపించారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ అవినాశ్రెడ్డి సీబీఐ దర్యాప్తునకు సహకరిస్తున్నప్పుడు కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం ఏముందని ప్రశ్నించింది. ''మీకో సలహా ఇస్తాం. మీరు వ్యక్తిగతంగా వాదిస్తున్నారు. చట్టంపై అవగాహన లేమితో వాదనలో అంతగా ప్రావీణ్యం లేకపోవచ్చు. మేం ఇప్పుడు ఈ పిటిషన్ను కొట్టివేస్తే సీనియర్ న్యాయవాదికి ఇబ్బంది అవుతుంది. అందుకే సెలవుల తర్వాత విచారణ జాబితాలోకి చేరుస్తాం'' అని సునీతనుద్దేశించి ధర్మాసనం పేర్కొంది. సీబీఐ దర్యాప్తు ఈ నెల 30 కల్లా పూర్తి కావాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా ఈ సమయంలో పేర్కొన్నారు. వాదనలకు సీనియర్ న్యాయవాదులను అనుమతించడం లేదన్న విషయాన్ని గుర్తు చేస్తూ తమకు ఇబ్బంది కలగ చేయవద్దని ఈ సందర్భంగా ధర్మాసనం సూచించింది. తాము ఇప్పుడు వాదనలకు అనుమతిస్తే మరో నలుగురు సీనియర్ న్యాయవాదులు తమను వివక్షకు గురి చేశారని ఆరోపించే అవకాశం ఉందని పేర్కొంది. తాము అనుమతించకపోయినప్పటికీ మీరు వాదనలు చేస్తున్నారంటూ లూత్రాను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టులో మరో బెంచ్ నిర్దేశించిన డెడ్లైన్ను తాము మార్చలేమని స్పష్టం చేసింది.

గడువు నిర్దేశించాక ఎలా మారుస్తాం?

సీబీఐకు నోటీసులిచ్చి విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించాలని ధర్మాసనాన్ని సునీత కోరారు. అయితే ఇప్పటికే మరో బెంచ్ జూన్ 30వ తేదీ అని గడువు నిర్దేశించిన తరువాత తాము ఎలా మారుస్తామని ధర్మాసనం ప్రశ్నించింది. ఒకవేళ ఇప్పుడు తాము జోక్యం చేసుకుంటే మొత్తం అంతా మారిపోతుందని వ్యాఖ్యానించింది. అయితే సీబీఐకి నోటీసులు ఇవ్వాలని సునీత మరోసారి అభ్యర్థించడంతో ధర్మాసనం స్పందిస్తూ.. ''ఎందుకు సీబీఐ రావాలని కోరుతున్నారు? రావాలో వద్దో సీబీఐ నిర్ణయించుకుంటుంది. ప్రతివాది సహకరించకుంటే, కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరమైతే, హైకోర్టు ఆదేశాలు సరికాకుంటే సీబీఐ తనకు తానే వస్తుంది. అందుకే చెబుతున్నాం. జూలై 3న కోర్టుకు రండి. మీ న్యాయవాది వాదిస్తారు' అని ధర్మాసనం సూచించింది.

న్యాయవాది వాదించడమే సబబు..

హైకోర్టు ఆదేశాలు నిష్ప్రయోజనమని ఈ అంశానికి సంబంధించి మరో కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని సునీత పేర్కొనడంతో అందుకే తాము సెలవుల తర్వాత రావాలని సలహా ఇస్తున్నామని ధర్మాసనం తెలిపింది. ప్రతివాది అవినాశ్ మీ కజినా? అని ధర్మాసనం పదేపదే సునీతను ప్రశ్నించగా... అవునని తన రెండో కజిన్ అని సునీత సమాధానమిచ్చారు. అయితే పిటిషనర్ తరఫున న్యాయవాది వాదించడమే సబబని, ఇందులో సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా సునీత పిటిషన్ను బుధవారం విచారణ జాబితాలో చేర్చాలని, అడ్వొకేట్ ఆన్రికార్డ్స్ హాజరవుతారని లూత్రా న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. అయితే సీబీఐకి నోటీసులు ఇవ్వడంలో తాము జోక్యం చేసుకోబోమని, పిటిషనర్ విజ్ఞప్తి మేరకు ఈ నెల 19న విచారణ జాబితాలో చేర్చాలంటూ రిజిస్ట్రీకి ధర్మాసనం ఆదేశాలిచ్చింది.


జిల్లా వార్తలు

ఇంటర్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న గురుకుల కళాశాలల్లో ఇంటర్(జనరల్, ఒకేషనల్) కోర్సుల్లో చేరేందుకు విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్సీఓ ప్రత్యూష తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో చేరేందుకు 2023 మార్చిలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. గురుకుల విద్యాలయ సంస్థ వెబ్సైట్ ద్వారా రూ.100 చెల్లించి ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

సింగరేణిలో అప్రెంటిస్కు దరఖాస్తుల ఆహ్వానం



సింగరేణి(కొత్తగూడెం): ఐటీఐ వివిధ ట్రేడ్లలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సింగరేణిలో ఏడాదికి కాలానికి గాను అప్రెంటిష్ షిప్ దరఖాస్తు చేసుకోవాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య సూచించారు. సింగరేణి ఉద్యోగులు, ఉద్యోగుల పిల్లలు, నిర్వాసిత కుటుంబాల్లో పిల్లలతో పాటు ఇతరులకు అవకాశముందని తెలిపారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులైతే 18నుంచి 28 ఏళ్ల వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులైతే 30-05-1995 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు WWW.apprenticeshipindia.org లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాక సింగరేణి వెబ్సైట్లో ఈనెల 14 నుండి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో WWW.apprenticeship.gov.in రిజిస్టర్ అయిన వారు కొత్త వైబ్సైట్ WWW.apprenticeshipindia.org లోకి మారాలని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోగా సమీప ఎంవీటీసీ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.

మరింత చేదుగా కాకర!

- వీడని చీడపీడలు.. వెంటాడుతున్న కరెంటు కష్టాలు
- ఎండిపోతున్న తోటలను వదిలేస్తున్న రైతులు
- ఫలితంగా గతేడాదికంటే తగ్గిన సాగు విస్తీర్ణం





నీరందక వదలిపోతున్న కాకర తోట
(ఇన్సెట్) చీడపీడలతో ఎండిపోతున్న బీరతీగ

ఇల్లెందురూరల్: మండు వేసవిలో భానుడి సెగలను తట్టుకుంటూ దుక్కులు సిద్ధం చేసి కాకర సాగు ప్రారంభించిన రైతులు చివరకు పెట్టుబడి కూడా దక్కని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏటా పంటకు సోకుతున్న చీడపీడలు, భారంగా మారుతున్న పెట్టుబడి, గిట్టుబాటు ధర దక్కకుండా మార్కెట్లో వ్యాపారుల మాయాజాలం వెరిసి కాకర రైతులు నష్టాల బాటలో పయనిస్తున్నారు. గత అనుభవాలను గుర్తించిన రైతులు ఈ ఏడాది చాలామంది కాకర సాగుకు దూరంగా ఉండిపోయారు. దీంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. దీనికి తోడు కొద్దోగొప్పో సాగు చేసిన తోటలకు ప్రస్తుత సీజన్లో ఎదురవుతున్న కరెంటు కష్టాలు మరింత ఇబ్బంది పెడుతుండటంతో చేసేదేం లేక తోటలను మధ్యలోనే వదిలేస్తున్నారు.

మండుటెండలో..

సాధారణంగా ఏ పంట అయినా తొలకరి జల్లు కురిసిన వెంటనే సాగు ప్రారంభిస్తారు. కానీ కాకర సాగు ఏప్రిల్ చివరి వారం నుంచే మొదలవుతుంది. దుక్కులు సిద్ధం చేయడంతోపాటు విత్తనాలు విత్తుకోవడం, మొలకను బతికించుకునేందుకు నీటి తడులు వంటి పనులన్నీ మండుటెండలో చేయాల్సిందే. ఉమ్మడి జిల్లాలో కాకరసాగు అత్యధిక విస్తీర్ణం ఇల్లెందు మండలంలోనే ఉంటుంది. ఈ మండలంలో ఏటా సుమారు 300 నుంచి 350 ఎకరాల విస్తీర్ణంలో కాకర వేస్తుండగా.. ఈసారి మాత్రం సుమారు 200 ఎకరాలకు మించలేదని చెబుతున్నారు.

చీడపీడలతో ఆగమాగం

ఎకరం విస్తీర్ణంలో వేసే విత్తనాలకు రూ.15 వేలు, కర్రలతో పందిరి ఏర్పాటు, బైండింగ్ వైర్, ప్లాస్టిక్ వైర్, దుక్కులు సిద్ధం చేయడం తదితరాల ఖర్చు సుమారు రూ.20 వేలు ఉంటుంది. వీటితోపాటు పురుగు ముందులు, పంట కోయడం ఖర్చు రూ.30 వేల వరకు వస్తుంది. ఎలాంటి తెగుళ్లు ఆశించకపోతే పెట్టుబడి వ్యయం రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఉంటుంది. కానీ, మూడేళ్లుగా కాకర పంటను ఆశిస్తున్న చీడపీడలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాది బుగ్గతెగులు, నల్లితెగులు ఆశించడంతో తోటలు వడలిపోతున్నాయని, ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు.

విడతల వారీగా కరెంట్

పంటను ఆశించే తెగుళ్ల కంటే కరెంట్ కష్టాలు అన్నదాతలను కుంగదీస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో నీటితడులు ఎక్కువగా అవసరమవుతుండటంతో విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు చేలవద్దే కాపలా ఉంటున్నారు. ఇచ్చే కాస్త కరెంట్ కూడా విడతల వారీగా ఇస్తుండడంతో నీటి తడి అందించడం సాధ్యం కావడం లేదు. ఇవన్నీ పక్కన పెడితే గట్టిగా వడగాలి వీచినా ట్రాన్స్కో అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడం గమనార్హం. ప్రధానంగా ఇల్లెందు మండలం పోలారం ఫీడర్ పరిధిలో ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇలా రకరకాల కారణాలతో సకాలంలో నీరందక సుమారు కాకర తోటలను రైతులు అలాగే వదిలేశారు. కొంత మంది మాత్రం ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

ప్రస్తుతం ఏజెన్సీలో మెరుగైన రీతిలో విద్యుత్ సరఫరా చేస్తున్నాం. పోలారం ఫీడర్ పరిధిలో మాత్రమే కొంత సమస్య ఎదురవుతోంది. దీనిని కూడా అధిగమించేందుకు నిరంతరం మా సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఈ కారణంగానే పోలారం కేంద్రంగా సబ్స్టేషన్ను మంజూరు చేయించుకున్నాం.

–రవి, ట్రాన్స్కో ఏఈ, ఇల్లెందు మండలం

నీరు లేక చేను వదిలేశా..



నేను అర ఎకరం విస్తీర్ణంలో కాకర సాగు చేశా. ప్రస్తుతం తోగ దశకు చేరుకుంది. పది రోజులుగా మూడు, నాలుగు గంటలు కూడా కరెంట్ రావడంలేదు. దీంతో నీరు అందక తోట ఎండిపోయింది. ఇలాగే చాలా మంది రైతుల తోటలు పూర్తిగా ఎండిపోయాయి.

–వాంకుడోత్ శ్రీను, రైతు, పోచారంతండా, ఇల్లెందు మండలం

చీడపీడలతో ఇబ్బంది పడుతున్నాం



మండుటెండలో ధైర్యం చేసి కాకర, బీర సాగు చేపట్టా. ఓ వైపు కరెంట్ కష్టాలు వేధిస్తున్న తరుణాన పంటలను ఆశిస్తున్న తెగుళ్లు మరీ కుంగదీస్తున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. సలహాలు ఇవ్వాల్సిన అధికారులెవరూ మావైపు చూడటం లేదు.

–మంచె రమేశ్, రైతు, కొమరారం, ఇల్లెందు మండలం

పేదలకు అండగా ఎంపీ నామా



చెక్కులు అందుకున్న వారితో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆపదలో ఉన్న పేదలకు ఎంపీ నామా నాగేశ్వరరావు అండగా నిలుస్తున్నారని పలువురు నాయకులు వెల్లడించారు. ఎంపీ సిఫారసుతో ఖమ్మం, మధిర, పాలేరు, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం, డోర్నకల్, ఇల్లెందు నియోజకవర్గాలకు చెందిన 41 మందికి మంజూరైన రూ.16.02 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎవరు ఆపదలో ఉన్నా పార్టీలకతీతంగా ఎంపీ సాయం చేస్తున్నారని తెలిపారు. నాయకులు కనకమేడల సత్యనారాయణ, చిత్తారు సింహాద్రియాదవ్, చింతలచెర్వు లక్ష్మి, చావా వేణు, వీరవెల్లి వెంకటేశ్వర్లు, తిప్పని అలివేలమ్మ, అంబేడ్కర్, తన్నీరు రవికుమార్, వాకదాని కోటేశ్వరరావు, గొడ్డేటి మాధవరావు, తాళ్లూరి హరీశ్, పాల్వంచ రాజేశ్, చీకటి రాంబాబు, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల వైఫల్యంతో సాగుకు దూరం

రాష్ట్రస్థాయి సదస్సులో జూలకంటి, పోతినేని

అశ్వారావుపేట: అత్యధిక సాగు యోగ్యత కలిగి ఉన్న సారవంతమైన భూములు దేశంలోనే ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యంతో రైతులు సాగుకు దూరమవుతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి, అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ అన్నారు. అశ్వారావుపేటలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పామాయిల్ సాగు విస్తరణకు బడ్జెట్ కేటాయించినా ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. గిట్టుబాటు ధర రావాలంటే రైతుల ఐక్యంగా ఉండాలన్నారు. కాగా, ఆయిల్ఫెడ్కు ప్రైవేట్ కంపెనీల రూపంలో ప్రైవేటీకరణ ప్రమాదం పొంచి ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గెలల గిట్టుబాటు ధర రూ.13,456గా కేంద్రంతో రాష్ట్రాలు ఒప్పందం చేసుకోవాలనడం ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనని ఆరోపించారు. ఈ సమావేశంలో కొక్కెరపాటి పుల్లయ్య, కాసాని ఐలయ్య, అన్నవరపు కనకయ్య, మాదినేని రమేశ్, బొంతు రాంబాబు, తుంబూరు మహేశ్వర్రెడ్డి, చలపతిరావు, తలశిల ప్రసాద్, అన్నవరపు సత్యనారాయణ, శివరాం పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రంగారెడ్డి

ఎక్కడికెళ్లినా వెంటే కరెంట్!



మహారాష్ట్రలోని నాగపూర్కు చెందిన సంచార జీవులు రఘునాథపాలెం మండలం ఇల్లెందు రోడ్డులోని నాగమ్మ దేవాలయం వెనుక గుడారాలు వేసుకుని ఉంటున్నారు. వీరు ఎక్కడికి వెళ్లినా 20 నుంచి 25 రోజులు పాటు ఉండి మూలికలు విక్రయిస్తుంటారు. వాహనాల్లో వస్తున్న వీరు లైట్లు, ఫ్యాన్లు నడిచేలా సోలార్ ప్యానళ్లకు తీసుకొచ్చారు. ఎక్కడా కరెంట్ కోసం చూడకుండా సోలార్ ప్యానళ్ల ద్వారా వచ్చే విద్యుత్ను వినియోగిస్తామని తెలిపారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేస్తున్న ఏడీ శ్రీనివాసాచారి

బలోపేతమవుతున్న ప్రభుత్వ పాఠశాలలు

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమాన్ని చేపట్టిందని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ సున్నం శ్రీనివాసాచారి తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా జూలూరుపాడులోని పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాప్రమాణాలు, ఉపాధ్యాయుల బోధన, లైబ్రరీ, బోధన సామగ్రిని పరిశీలించాక తొలిమెట్టు, మధ్యాహ్న భోజనాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో 4వ తరగతి చదివిన విద్యార్థులు గురుకులంలో సీట్లు సాధించడంతో అభినందించారు. అలాగే, విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఎంఈఓ గుగులోత్ వెంకట్, హెచ్ఎం వాకపల్లి గీత, ఉపాధ్యాయులు డి.భాస్కర్, సీతారాములు, స్వర్ణ, విజయలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.